క్లుప్తంగా

చేతిపంపు ప్రారంభం



చేతిపంపు ప్రారంభిస్తున్న మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: భక్తుల సౌకర్యార్థం చేతి పంపు ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. సోమవారం మండలంలోని వావుదాం గ్రామంలోని భీమన్న ఆలయం వద్ద చేతిపంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో నీటి సమస్యను గుర్తించి భక్తుల సౌకర్యం కోసం చేతిపంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు లింగు, పోషన్న తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాపూర్: మండలంలో నాలుగు స్త్రీశక్తి (మీసేవ) కేంద్రాల నిర్వహణకు మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఎం దేవానంద్ అన్నారు. ఇందుకు మండలంలోని మహిళా సంఘంలో సభ్యులుగా ఉండి ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న వారు అర్హులన్నారు. మండలంలోని చోర్‌పల్లి, లింగాపూర్, మామిడిపల్లి, లోద్దిగూడ గ్రామపంచాయతీలకు చెందిన స్థానికంగా ఉండే వారు ఈనెల 12వ తేదీలోపు లింగాపూర్‌లోని ఐకేపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నోట్‌పుస్తకాలు పంపిణీ



నోట్‌పుస్తకాలు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

దహెగాం: మండలంలోని మర్రిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం మండల కేంద్రానికి చెందిన పుప్పాల మల్లక్క ట్రస్టు నిర్వాహకుడు పుప్పాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు అందజేశారు. కార్యక్రమానికి ఎస్సై రాజు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్, ట్రస్టు సభ్యుడు పుప్పాల లక్ష్మీనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు నిల్



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

దహెగాం: మండల, గ్రామస్థాయిలోని సమస్యలను పరిష్కరించడానికి సోమవారం నుంచి మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి దరఖాస్తులు రాలేదు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతోనే ప్రజావాణికి ప్రజలు రాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కౌటాల: ప్రతి ఒక్కరూ నాలుగు మొక్కలు నాటాలని ఉపాధ్యాయుడు సాయినాథ్ అన్నారు. సోమవారం మండలంలోని గురుడుపేట ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తారంగా మొక్కలు నాటితేనే సంమృద్ధిగా వర్షాలు పడుతాయని తెలిపారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న యువకులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గజ్జిగూడ గ్రామానికి చెందిన తల్లీకూతుళ్లు కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేసుకోగా, తల్లి కవిత, రమ్య, లక్ష్మిలు మృతి చెందగా, మరో కూతురు ఐశ్వర్య మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఐశ్వర్యకు వైద్య ఖర్చుల నిమిత్తం డబ్బులు అవసరం కాగా, మానవతా దృక్పథంతో యువకులు పుల్ల శ్రీకాంత్, ఇనుముల ఉమాకాంత్‌లు సోషల్ మీడియా వేదికగా దాతల సహకారంతో రూ.40,300 సేకరించారు. సోమవారం ఐశ్వర్య కుటుంబసభ్యులకు దాతలు అందించిన నగదును అందజేశారు.

సమస్యలతో సహవాసం!



బస్టాండ్ లేక కుమురంభీం చౌక్ వద్ద బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

- బస్టాండ్, పబ్లిక్ టాయిలెట్లు కరువు
- అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- ఇబ్బందుల్లో జైనూర్ వాసులు

జైనూర్: ఏజెన్సీ ప్రాంతాల్లో ఒకటైన జైనూర్ మండల కేంద్రంలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో వందకు పైగా గ్రామాలు ఉండగా మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం నిత్యం ఆయా గ్రామాల ప్రజలు వస్తుంటారు. మండలకేంద్రంలో కనీస సౌకర్యాలు లేక మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మండలం అభివృద్ధికి ఆమడదూరంలో నిలుస్తోంది.

అనేక సమస్యలు..

మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్‌లు లేకపోవడంతో మండల కేంద్రానికి వచ్చే ప్రజల తిప్పలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వివిధ గ్రామాల నుంచి ప్రజలు నిత్యావసరాల కొనుగోలుకు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. వారికి మల, మూత్ర విసర్జన చేసేందుకు మండల కేంద్రంలో వసతులు కల్పించకపోవడంతో ఎక్కడబడితే అక్కడే కానిచ్చేస్తున్నారు. మండల కేంద్రంలో నిర్వహించే సంతరోజు వ్యాపారస్తులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నా అధికారులు మాత్రం దృష్టి సారించడం లేదు.



అధ్వానంగా పరిసరాలు

బస్టాండ్ లేక తిప్పలు..

మండల కేంద్రంలో నేటికీ బస్టాండ్ లేక పోవడంతో వివిధ గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు చెట్ల కింద, షాపుల ఎదుట నిల్చొని వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధికి నిధులు విడుదల చేస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

పారిశుధ్య నిర్వహణ కరువు..

మండల కేంద్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురికి కాలువల వ్యవస్థ సరిగా లేని కారణంగా మురుగు నీరు నాలాల్లో కాకుండా రోడ్లపై పారుతుంది. నాలాల్లో మురుగునీరు నిలుస్తుండడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు.

సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి



మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టాలి. మండల కేంద్రానికి వచ్చే వారు మల, మూత్ర విసర్జనకు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వచ్చే వారు కొన్ని సందర్భాల్లో రోజంతా మండల కేంద్రంలోనే ఉండాల్సి వస్తుంది. మహిళల తిప్పలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

– ముండే సతీశ్, జామ్ని

బస్టాండ్ లేక ఇబ్బందులు



మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో వివిధ గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు చెట్లు, షాపుల ఎదుట ప్రయాణికులు నిల్చోవాల్సిన పరిస్థితి ఉంది. బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– చాటే ఏక్‌నాథ్, జైనూర్

మహానేత వైఎస్సార్‌కు నివాళి



కాగజ్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతిని కాగజ్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసంలో మాజీ జెడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పేదల పెన్నిధన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు పిర్సింగుల పోచయ్య, సిద్దిక్, బాబా పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎమ్మెల్సీ నివాసంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్, నాయకులు రాణాప్రతాప్, మహేశ్, మురళీగౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.



కౌటాల: జయంతి నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు

కౌటాలలో..

కౌటాల: పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన మహోన్నత నేత మాజీ సీఎం దివంగత వైఎస్సార్ అని ఆర్‌ఎంపీ సంఘం కౌటాల మండలాధ్యక్షుడు కుమ్మరి రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతి బాపూలే విగ్రహం ఎదుట సోమవారం రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చెరువును తలపిస్తున్న రహదారి



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడీలోని రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షపు నీటితో రోడ్డు చెరువును తలపిస్తోంది. సోమవారం కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిల్వడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. వారు మాట్లాడుతూ కొందరు అక్రమ కట్టడాలను నిర్మించడంతో సమస్య తలెత్తుతుందని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులకు సమస్యను పరిష్కరించాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డుపై మురికినీటితో పాటు, వర్షం నీరు నిల్వ ఉండడంతో పిల్లలు, వృద్ధులు రహదారిపై నడవాలంటే జంకుతున్నారని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలి

దహెగాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అర్థమయ్యే విధంగా బోధించాలని ఐసీడీఎస్ సీడీపీవో సురేఖ అన్నారు. అబిత్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో గత మూడు రోజులుగా ప్రాథమిక స్థాయి విద్యా విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. సోమవారం శిక్షణ ముగిసిన సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక విద్య వైపు ఏ విధంగా ఆకర్షితులను చేయాలో తరగతుల్లో నేర్పించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు ప్రతీరోజు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనసూర్య, మాస్టర్ ట్రైనర్ సరోజినిదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో సురేఖ

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మె



దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: జీవో నెంబర్ 10ని రద్దు చేయాలని అంగన్‌వాడీలు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 3వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ జీవో నం.10 రద్దు అయ్యేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ. లక్ష, పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉమ, లక్ష్మీ, బతుకమ్మ, చాయ, శంకరమ్మ, స్వర్ణ, విక్రుబాయి, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

రెబ్బెన: సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్న సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని షీటీం ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వర్ అన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని అన్నపూర్ణ హైస్కూల్‌లో షీటీం సేవలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణే షీ టీం ప్రధాన లక్ష్యమన్నారు. షీ టీం అందించే సేవలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలనే లక్ష్యంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. హింసా, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా మహిళలు, బాలికలు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. బాధితుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. జిల్లాలోని మహిళల రక్షణ కోసం షీ టీంలు పని చేస్తున్నాయని ఏదైనా అత్యవసర సమయంలో సహాయం కోసం డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. షీటీం డబ్ల్యూహెచ్‌సీ సునీత, రమాదేవి, డబ్ల్యూపీసీ స్వప్న, సునీత, పీసీ ఆనంద్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్

కల్వర్టుపై నుంచి నీటి వరద



కెరమెరి: మండలంలో సోమవారం కురిసిన వర్షంతో వాగులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సాంగ్వి, ఇంద్రానగర్, కెలికే గ్రామాల సమీపంలో ఉన్న కల్వర్టులపై నుంచి నీరు ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజలు ఎటూ వెళ్లలేకపోయారు. లక్మాపూర్, అనార్‌పల్లి వాగులు పొంగిపొర్లుతున్నాయి. పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లా నూతన అధ్యక్షుడికి సన్మానం



డబ్బా బాపును సన్మానిస్తున్న నాయకులు

కౌటాల: ఆదివాసీ కొలావార్, మన్నెవార్ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కౌటాలకు చెందిన డబ్బా బాపును సోమవారం మండల కేంద్రంలోని ఆదివాసీ కొలావార్, మన్నెవార్ సంఘం భవనం ఎదుట ఆదివాసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వాలు ఆదివాసీల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలన్నారు. ఆదివాసీలు ఐకమత్యంగా ఉండి తమ హక్కుల సాధనకు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో కౌటాల మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు రవీందర్ గౌడ్, సొల్ల బాపు, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి



ఎల్కపల్లి పంచాయతీ ఆవరణలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆలోచన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు క్రిష్ణమాచారి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎల్కపల్లి పంచాయతీ కార్యాలయంలో సోమవారం కార్మికుల కోరికల దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ వైపు వేగంగా అడుగులు వేస్తుందన్నారు. కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న కార్మికల కోర్కెల దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్మికులు ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు గణపురం శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

చేతిపంపు మరమ్మతు చేయాలి



అప్పపల్లిలో పని చేయని చేతిపంపు

ఆసిఫాబాద్: మండలంలోని అప్పపల్లి ఆర్ఆర్ కాలనీలో చేతి పంపు పని చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గత కొన్ని నెలలుగా చేతిపంపు పని చేయడం లేదని, పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిది

రెబ్బెన: తుంగెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అందించిన సహకారం మరువలేనిదని పాఠశాల హెచ్‌ఎం వినయ్‌కుమార్ అన్నారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సోమవారం తాజా మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, మాజీ సర్పంచ్ పెంటయ్య, ఉప సర్పంచ్ సాయికృష్ణలతో పాటు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు హనుమంతురావు, గోవర్ధన్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తుంగెడ గ్రామాభివృద్ధితో పాటు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ఎంతో కృషి చేశారన్నారు. వీవో శుక్రుబేగం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



సౌందర్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

'బూర్గుడ హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి'

ఆసిఫాబాద్: పదవీ విరమణ పొందిన తన పింఛన్ ఫామ్‌లు పంపడంలో నిర్లక్ష్యం వహిస్తూ, పింఛన్ రాకపోవడానికి కారణమైన బూర్గుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్‌పై చర్యలు తీసుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు టి.సత్యనారాయణ కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు సోమవారం ఫిర్యాదు చేశారు. గత నెల 30న పదవీ పొందిన తన పింఛన్ సంబంధించిన పత్రాలపై హెచ్‌ఎం సంతకం చేయకపోవడంతో పింఛన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 18 సంవత్సరాల స్కేల్ మంజూరు కావాల్సి ఉండగా, ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యం వల్ల పెన్షన్ దరఖాస్తు ఫాం సకాలంలో పంపలేక పోయానన్నారు. పదవీ విరమణ అనంతరం రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్ క్లైయిమ్ చేయలేక, పింఛన్ రాక మానసికంగా ఇబ్బంది పడుతున్నానని వాపోయారు. అనారోగ్యంతో చికిత్స పొందిన తన తల్లికి సంబంధించిన వైద్య బిల్లులు డీఈవో కార్యాలయానికి పంపడానికి కాలయాపన చేస్తున్నాడని ఆరోపించారు. ఉన్నతాధికారులు తగిన ఆదేశాలు జారీ చేయాలని, సదరు ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నార్నూర్: వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ గ్రామంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే వైద్య శిబిరాలు నిర్వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని ఏంపల్లి కొలంగూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలో భాగంగా ప్రతీ సబ్‌సెంటర్ పరిధిలోని గ్రామాలను సందర్శించి ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. హై రిస్క్ గ్రామాల్లో గర్భిణులను గుర్తించి ముందస్తు చర్యలో భాగంగా సంరక్షణ కేంద్రానికి తరలించాలని సూచించారు. శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరందాస్, జవహర్ పాల్గొన్నారు.